నేటి దినపత్రిక

# సూర్య

18వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం | 23 జనవరి 2025 | పేజీలు 8


## నిరాశ్రయులకు అన్నా క్యాంటీన్ల
# ఆహారం అందించండి

**కమిషనర్ సూర్యతేజ**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసి ఉన్న శరణార్థుల శిబిరంలో ఉన్న నిరాశ్రయులకు అన్నా క్యాంటీన్ల నుంచి ఆహారాన్ని అందించాలని, అలాగే భవనం మరమ్మత్తులను వెంటనే చేయించాలని కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ బుధవారం స్థానిక పాత మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలోని శరణార్థుల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శిబిరంలో ఉన్న వారందరికీ సబ్బు, నూనె, ఇతర క్రాస్మోటిక్స్, దుప్పట్లు, నూతన వస్త్రాలు -మిగతా 2లో

## పోలీసు శాఖకు సాయుధ దళ
# పోలీసుల సేవలు కీలకం



### సాయుధ బలగాల వార్షిక సమీకరణను ప్రారంభించిన ఎస్పీ కృష్ణకాంత్

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** పోలీసు కవాతు మైదానంలో ప్రతి సంవత్సరం జరిగే జిల్లా సాయుధ బలగాల సిబ్బంది వార్షిక సమీకరణ రీఫ్రెష్ ట్రైనింగ్‌ను బుధవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలు పరిరక్షించడంలో జిల్లా సాయుధ దళ పోలీసుల సేవలు పోలీసుశాఖకు ఎంతో కీలకమన్నారు. వృత్తిరీత్యా పోలీస్ శాఖలో చోటు చేసుకుంటున్న నూతన మార్పులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని మెరుగైన సేవలందించాలన్నారు. పోలీసులు చేసే ప్రతీ పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయ స్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. సిబ్బంది యొక్క సర్వీస్, ఇతర సమస్యలు ఉంటే తెలపాలని, సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు.

సాయుధ దళ పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామాలు అలవరచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలన్నారు. ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఈ మొబలైజే షన్‌లో సాయుధ దళ పోలీసులకు ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసాన్ని, సైబర్ నేరాలపై అవగాహన, ఆర్థిక స్థితులను మెరుగుపర్చేందుకు మొబలైజేషన్ ఎంతో ఉపయోగకరమన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ మొబలైజేషన్ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. అత్యాధునిక ఆయుధాల నిర్వహణ, ఉపయోగంతో పాటు ఫైరింగ్, డ్రిల్, మార్చ్ ఫాస్ట్, మాబ్ కంట్రోల్, వీవీఐపీ ఎస్కార్ట్స్, బందోబస్త్ అన్ని అంశాల గురించి పూర్తి అవగాహన పొందాలన్నారు. ఉద్యోగ విరామంలో దొరికే సమయాన్ని కుటుంబంతో గడుపుతూ, పిల్లల క్రమశిక్షణ, వారి విద్యాభ్యాసం, పురోగతి తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, డీఎస్పీలు సింధుప్రియ, గట్టమనేని శ్రీనివాసరావు, చెంచు రామారావు, చంద్రమోహన్, ఆర్ఐలు హరిబాబు, రాజారావు, అంకమరావు, పౌల్ రాజు, ఎస్‌బీ సీఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళలకు చట్ట పరిజ్ఞానం అవసరం

### లోక్ అదాలత్ న్యాయమూర్తి వాణి - పేడూరు ఎస్టీ కాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల మహిళలకు మాయమాటలు చెప్పి బలవంతంగా వ్యభిచార గృహాలు తరలిస్తున్న వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని లోక్‌అదాలత్ న్యాయమూర్తి కే.వాణి పిలుపునిచ్చారు. గ్రామీణ పేద ప్రజలలో న్యాయ చైతన్య కలిగించాలన్న లక్ష్యంతో సాగుతున్న న్యాయ విజ్ఞాన సదస్సు తోటపల్లి గూడూరు మండలం పేడూరు గ్రామం కవులు దిబ్బ ఎస్టీ కాలనీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి యామిని ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి వాణి మాట్లాడుతూ.. ఇలాంటి నేరాలు అరికట్టడానికి 1986లో మానవ అక్రమ రవాణా నిరోధ చట్టం అమలోకి వచ్చిందన్నారు. 1987వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా న్యాయ సేవ అధికార సంస్థ చట్టం అమల్లోకి వచ్చిందని, ఈ చట్టం ద్వారా సమాజంలోని పేద, బడుగు బలహీన వర్గాలు, మహిళలకు -మిగతా 2లో

## 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను
# ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి




**కావలి, మేజర్‌న్యూస్ :** రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కావలి పట్టణంలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో విద్యార్థులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ దగ్గర నుండి విద్యార్థులు పోలీసులు రవాణా శాఖ సిబ్బందితో కలిసి కావలి సెల్ఫీ పాయింట్ వరకు భారీగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొదటగా ఈ కార్యక్రమానికి వచ్చి ర్యాలీలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని విద్యార్థులకు, ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన రవాణా సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి చెందాలన్నా.. యువతి యువకులైనా మీదే బాధ్యత అని, -మిగతా 2లో

# వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోండి

## అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసుకునే ప్రతి ఒక్కరికి ట్రేడ్ లైసెన్సులపై అవగాహన కల్పించి, తప్పనిసరిగా వారు పొందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ నందన్ శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శానిటేషన్ విభాగంతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క వ్యాపారానికి ట్రేడ్ లైసెన్స్ అందించి వాటిని ఎంఎస్ఎంఈ సర్వేలో పొందుపరచాలని సూచించారు. కమర్షియల్ ట్రేడ్ లైసెన్స్‌లను గుర్తించి, నోటీసులను జారీ చేసి ఫిబ్రవరిలోపు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి నెల అనంతరం అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుంది కావున.. ముందుగానే ట్రేడ్ లైసెన్సులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. చెత్త తరలింపు వాహనాలకు సంబంధించిన సమస్యలు సంబంధిత వెహికల్ ఇంచార్జ్ డీఈ రఘురాం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిరోజు జరిపే ఫాగింగ్ సాయంత్రం లోపు ముగిసేలా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన అన్ని ప్రాంతాల్లో స్ప్రేయర్ల ద్వారా పిచికారి చేయడం, డ్రైను కాలువలలో ఆయిల్ బాల్స్ వేయడం, కాలువల్లో గంబూజియా చేప పిల్లలను వదలడం వంటి చర్యలను వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఖాళీ స్థలాలలో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని, హెచ్చరిక బోర్డులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ స్థాయిలో పరిష్కారం కానీ స్థానిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన పరిష్కారం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క వార్డు శానిటేషన్ కార్యదర్శి తమ విధుల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించకూడదని తెలియజేశారు. పెంపుడు కుక్కల యజమానులను కలిసి నగర పాలక సంస్థ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ విభాగాల వార్డు సచివాలయ కార్యదర్శులు అందరూ సమన్వయంతో విధులు నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అదనపు కమిషనర్ సూచించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు క్రమశిక్షణ పాటించి సమయపాలన విధుల పట్ల నిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. సచివాలయ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, శానిటేషన్ విభాగం సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దేశ భవిష్యత్తు మీ మీదే ఆధారపడి ఉందని తెలిపారు. అంతే కాకుండా ప్రపంచంలో మార్పు రావాలా.. రాష్ట్రంలో మార్పు రావాలంటే మొదట విద్యార్థి దశ నుండే ప్రారంభం కావాలని తెలిపారు. అలాగే ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్క విద్యార్థి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలని, అలాగే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాల ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్క వాహనదారులు తాము తన కుటుంబం ఎంత ముఖ్యమో మన ఎదురుగా వస్తున్న వ్యక్తులు వాహనాలు అంతే ముఖ్యమని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో కావలి పట్టణ రవాణా శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళలకు చట్ట పరిజ్ఞానం అవసరం

(మొదటి పేజీ తరువాయి)



ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. న్యాయపరంగా ఎవరికైనా సాయం కావాల్సిన పక్షంలో జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించిన పక్షంలో వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో తోటపల్లి గూడూరు తహసిల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర పాల్గొన్నారు.

# తమ్ముడు మాట ఇచ్చాడు.. అన్న నెరవేర్చాడు

**నీలగిరి సంఘంలో 38 లక్షలతో సీసీ డ్రైన్ పనులకు కోటంరెడ్డి శంకుస్థాపన**

**హర్షం వ్యక్తం చేసిన నీలగిరి సంఘం స్థానికులు**





**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని నీలగిరి సంఘం వాసులు ప్రధానంగా ఎన్నో ఏళ్ల నుంచి డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమం జరిగినప్పుడు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. తమ్ముడు గిరిధర్ రెడ్డి హామీ మేరకు అన్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డ్రైనేజీ కాలువల నిర్మాణానికి 38 లక్షల నిధులను కేటాయించారు. నెల్లూరు రూరల్ పరిధిలోని 35వ డివిజన్ నీలగిరి సంఘంలో 38 లక్షల రూపాయల వ్యయంతో సీసీ డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీలగిరి సంఘం వాసులు డ్రైనేజీ సమస్యలకు పరిష్కారంగా ఈ నిధులను కేటాయించామని, మరో 9 లక్షల రూపాయలు కేటాయిస్తే ఈ ప్రాంతంలో శాశ్వతంగా డ్రైనేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎంతోమంది కాంట్రాక్టర్లు డ్రైనేజీ నిర్మాణానికి ముందుకు రాలేదని, తాము పూనుకొని ఈ పనులు చేయిస్తున్నామని స్థానికులు అందరూ ఈ డ్రైనేజీ కాలువ నిర్మాణానికి తమవంతు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత తాటి వెంకటేశ్వర్లు, యాకసిరి శరత్‌చంద్ర, వదనాల వెంకట రమణ, ముని, మందా బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులకు అన్నా క్యాంటీన్ల ఆహారం అందించండి

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని సూచించారు. జాతీయ పట్టణ జీవనోపాధుల పథకం ఏఆర్‌డిపిడి నిర్వహణలోని నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం, నెల్లూరు నగరపాలక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు 50 మంది నిరాశ్రయులకు అన్నా క్యాంటీన్ల ద్వారా ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అన్నా క్యాంటీన్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు వివిధ సూచనలు జారీ చేశారు. తరువాత సమీపంలోని వీధి శునకాల జనన నియంత్రణ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి వెటర్నరీ వైద్యునితో మాట్లాడారు. శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాల నమోదు రిజిస్టర్‌లను కమిషనర్ పరిశీలించి తగిన సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానిక బాలాజీనగర్ బాజీతోట ప్రాంతంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నేర్చుకుంటున్న కర్రసాము ప్రదర్శనను కమిషనర్ వీక్షించి విద్యార్థులను అభినందించారు. 15వ డివిజన్లోని 1, 2, 3 సచివాలయాలను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి కార్యదర్శులకు వివిధ సూచనలు జారీ చేశారు. సచివాలయ పరిధిలో ఆస్తి పన్ను, తాగునీటి కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేసి



100 శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కమిషనర్ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత, పారిశుద్ధ పనుల పర్యవేక్షణను క్రమం తప్పకుండా ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, ఈఈ రహంతు జాని, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, ఇంజనీరింగ్, పబ్లిక్‌హెల్త్, ప్లానింగ్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన మేకపాటి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని 7వవార్డు పరిధిలో ఇటీవల వివాహం జరిగిన దంపతులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆశీర్వదించారు. వైసీపీ నాయకుడు జమ్రు సోదరుడు అన్సర్ వివాహం ఇటీవల జరిగింది. ఆయన నివాసానికి విచ్చేసిన విక్రమ్‌రెడ్డి వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నోటి వినయ్ కుమార్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని మహిమలూరులో బుధవారం స్తానిక మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పలువురిని పరామర్శించారు. పట్టణంలో 7వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగమ్-వైసిపినేత సయ్యద్ జమీర్‌బాషా దంపతుల కుమారుడు సయ్యద్ జహీర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దాంతో మేకపాటి విక్రమ్‌రెడ్డి వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. జహీర్ మృతిగురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసిన విక్రమ్‌రెడ్డి జమీర్‌బాషా, నౌషాద్‌బేగమ్‌లను ఓదార్చి వారికి సానుభూతి తెలిపారు. మండలంలోని మహిమలూరులో మాజీ ఎంపీటీసీ మెంబర్ చింతలపల్లి కవితమ్మ భర్త సుధాకర్‌రెడ్డి మంగళవారం మృతిచెందడంతో బుధవారం విక్రమ్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్ళి పరామర్శించారు. కవితమ్మను పరామర్శించి సుధాకర్‌రెడ్డి మృతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసిన విక్రమ్‌రెడ్డి కవితమ్మకు, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యకమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, వైసిపి యువజనవిభాగం జిల్లా ప్రధానకార్యదర్శి నోటి వినయ్ కుమార్‌రెడ్డి, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనసేనకు గాజు గ్లాసు గుర్తు రిజర్వ్ చేసిన ఎన్నికల సంఘం

### హర్షం వ్యక్తం చేసిన జనసేన మండల ప్రధాన కార్యదర్శి సింగమనేని అరవింద్ యాదవ్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో జనసేన ను చేర్చడం జనసేనకు గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసిన సందర్భంగా జలదంకి మండల జనసేన ప్రధాన కార్యదర్శి సింగమనేని అరవింద్ యాదవ్ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన మండల ప్రధాన కార్యదర్శి సింగమనేని అరవింద్ యాదవ్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో 100శాతం విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు సాధించిందని పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో, 2 లోక్ సభ స్థానాల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకుందని ఈ క్రమంలో జనసేన రికగ్నైజ్డ్ పార్టీగా నిలిచి, గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసుకొనడం జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తగ్గి ఎలా నెగ్గాలో నిరూపించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేస్తూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తున్నారని అరవింద్ యాదవ్ పేర్కొన్నారు.

# పాఠశాలను హైస్కూల్‌గా మర్చాలని ఎమ్మెల్యే వినతి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం సిద్ద వరం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రస్తుతం మార్గదర్శకాల ప్రకారం సరి అయిన ఎన్రోల్మెంటు ఉన్నందున హైస్కూలుగా అప్గ్రేడ్ చేయాలని, తగిన వసతులు కల్పించాలని కావలి నియోజక వర్గ ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డికి బోగోలు మండల తెలుగు యువత అధ్యక్షులు ఆదిశేషయ్య, సిద్దవరం గ్రామస్తులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కచ్చితంగా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా ప్రస్తుతమున్న మార్గదర్శకాలను అనుసరించి హై స్కూల్‌గా అప్గ్రేడ్ చేయుటకు జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడుతానని పాఠశాలకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అన్నంగి నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సుదర్శనం, తెలుగుదేశం పార్టీనాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పేయల శీనయ్య దళిత నాయకులు కాకి తిరుపతయ్య ఇతర గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాల్లో రిక్రూట్ మెంట్ చేయాలి : ఏఐఐఈఏ

**కావలి, మేజర్‌న్యూస్ :** జీవిత బీమా సంస్థలో క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాల్లో నియామకాలు చేయాలని, ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్‌అసో సియేషన్ (ఏఐఐఈఏ) గుర్తింపును కొనసాగించాలని ఐసీఈయూ సంయుక్త కార్యదర్శి జి.రవి కుమార్ డిమాండ్ చేశారు. సదరు సమస్యల పరిష్కారం కోరుతూ, కావలి ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బుధవారం భోజన విరామ సమయంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఎల్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.



# 108 వాహనాల్లో ఉద్యోగావకాశాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108 వాహనాల్లో ఉద్యోగ అవకాశలున్నాయని జిల్లా మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

**ఈఎంటీ అర్హత :** జీఎంఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బి.ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు చేసినవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు జనవరి 29 తేది 2025 సాయింత్రంలోపు 108 కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8328461648, 9642027098 నంబర్లతో సంప్రతించాలని ఆయన పేర్కొన్నారు.

# బోగిరి మణెమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదానం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో అనాధలకు బోగిరి మణెమ్మ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నదానం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మణెమ్మ కుమారుడు బోగిరి ప్రభాకర్ మాట్లాడుతూ.. తన తల్లి పేరుమీద ప్రతి సంవత్సరం ఆదరణ కేంద్రానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోగిరి యోహాను ఆదరణ కేంద్రం డైరక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు తదితరులు పోల్గొన్నారు.

# ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామస్తులు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలలుగా గ్రామంలో ఉపాది హామీ పనులు కల్పించకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆటు వ్యవసాయ పనుల్లేక. ఇటు ఉపాధి హామీ పని కల్పించకపోవడంతో కుటుంబ పోషణ భారమై పలువురు ఇతర ప్రాంతాలకు పొట్టచేతపట్టుకొని వలసబాట పడుతున్నారన్నారు. పనులు కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరువైందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి ఉపాధి పనులుకల్పించాలన్నారు.

# ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పర్యావరణ పరిక్షణలో భాగంగా ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శోభన్ బాబు సూచించారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, సిబ్బంది రమేష్ అజీమ్, చిన్నఖాసిం తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం ముందు

# మరో నిర్మాణం చేపట్టవద్దని ఎమ్మెల్యేకి తెలపండి

## టీడీపీ కన్వీనర్ మధు మోహన్ రెడ్డిని కోరిన వెలుగు సిబ్బంది





**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి వెలుగు కార్యాలయం ముందు నిర్మిస్తున్న నిర్మాణాలు ఆపాలని తెలపండి అంటూ జలదంకి మండల టీడీపీ కన్వీనర్ పులుగుంట మధు మోహన్ రెడ్డిని వెలుగు కార్యాలయ సిబ్బంది కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం డ్వాక్రా సంఘాలు నా మానస పుత్రిక మహిళలకు గుర్తింపు, ఆర్థిక స్వేచ్ఛ ఉండాలనే నాడు డ్వాక్రా సంఘాలు పెట్టానని డ్వాక్రా నా మానస పుత్రిక స్వశక్తి కలిగిన పేద మహిళలను అభివృద్ధి పథంలో నడపాలనే ఆలోచనలోంచే డ్వాక్రా పుట్టింది. నేను వేసిన ఆ విత్తనం నేడు పెద్ద చెట్టయ్యిందని పదే పదే చెబుతుంటారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందు తుందని చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా సంఘాలు) ఏర్పాటు చేశార న్నారు. మహిళల్లో పొదుపు ప్రవృత్తిని పెంచేం దుకు పది మందితో ఎస్‌హెచ్‌జీ సంఘాలను రూపొందించి మహిళలు పొదుపు చేసిన సొమ్ము లకు మరికొంత ప్రభుత్వం అందించి వారిచే యూనిట్లు ఏర్పాటు చేయించి ఆర్థికంగా తోడ్పా టు ఇవ్వటం డ్వాక్రా సంఘాలు లక్ష్యం ఇంతటి ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన మహిళా స్వయం సంఘాలకి ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయానికి తూట్లు పొడుస్తూ మా కార్యాలయ ప్రాంగణంలోనే కార్యాలయం ఎదురుగానే మరో కార్యాలయం నిర్మించేందుకు పనులు ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యాలయాల ఆవరణలో ఎన్ఆర్ జీఎస్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయాలు ఉన్నాయని నిత్యం వందల మంది ప్రజలు కార్యాలయానికి వస్తుంటారని, పార్కింగ్, ఇతర కార్యక్రమాలకు ఇబ్బంది అవుతుందని వారు తెలిపారు. ఇంత రద్దీగా ఉండే కార్యాలయంలో ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో మరింత ఇరుకుగా మారి ప్రజలకు, స్థానిక కార్యాలయాల సిబ్బందికి చాలా అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.

# ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సందానీ దంపతులకు సన్మానం




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించు కున్న ఉదయగిరి పట్టణం దిలావార్ భావి వీధికి చెందిన షేక్ సందానీ, షాహీన్ దంపతులను, చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్ హుసేన్‌ను బుధవారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ చెక్కనగిషీ కేంద్రం ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతోపాటు కేంద్రంలో వందలాది మంది మహిళలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. చెక్కనగిషీ కేంద్రానికి ప్రభుత్వం అన్నివిధాల సహకరించి అభివృద్ధి చేస్తే మరింత మంది మహిళలు ఉపాధి పొందడంతోపాటు వారి చేతుల్లో నుంచి అద్భుతమైన కళాఖండాలు ఉద్భవిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అబ్దుల్లాక్, మాలిక్, బాలకృష్ణ ఆరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాక్షరి జయశంకర్‌కు నివాళులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 44వ డివిజన్‌లో వైసీపీ నాయకులు పంచాక్షరి అగ్నేష్ తండ్రి పంచాక్షరి జయశంకర్ పెద్ద కర్మ కార్యక్రమానికి బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై పంచాక్షరి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి చంద్రశేఖర్ రెడ్డి వెంట వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, 46 డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్, 44వ డివిజన్ కార్పొరేటర్ నీలి రాఘవ రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు ముంగమూరు అక్షిత్ రెడ్డి, వాణిజ్య విభాగం నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ చిత్రపటం బహుకరణ

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్ర పటాన్ని బీజేపీ నాయకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి, సర్వసభ సమావేశ మందిరానికి బహూకరించారు. చిత్రపటాన్ని బీజేపీ నాయకులు ప్రదర్శనగా తీసుకువెళ్లి ఎంపీడీవో గొట్టిపాటి వేణుగోపాల రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ వంశీధర్ రెడ్డి, మండల కార్యదర్శి అరుణ రెడ్డి, మండల బీసీ మోర్చా అధ్యక్షుడు జానాపురం రత్తయ్య,మండల యువమోర్చా నాయకులు మారంరెడ్డి హరీష్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు బొద్దుశివారెడ్డి, గడ్డం వెంగల్ రెడ్డి, నజీరు తిరుపాలు, మాలెం వినోదు తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీల ఆర్థికాభివృద్ధికి రాయితీ రుణాలు

## ఈ ఏడాదికి రూ.326 కోట్లతో 49 వేల మందికి లబ్ధి చేకూరనుంది : ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్. అబ్దుల్ అజీజ్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళుతుందని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. మైనార్టీలకు రాయితీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం తరపున రూ. 152.50కోట్లు, వెచ్చింపుకు జీవో విడుదల చేసిందని తెలిపారు. మరో 50శాతం రూ.152.50 కోట్లు రుణ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పనకు అదనంగా రూ.21.07 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అజీజ్ తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీ రుణాలను 19,790 మందికి, నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన ద్వారా 29,428 మందికి మొత్తం లబ్ధిదారులు 49,218 మంది ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూ తను ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు.

**కేటగిరీల వారీగా రాయితీ రుణాల మంజూరు**

మైనార్టీల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వార్షిక రాయితీ రుణ మంజూరు ప్రణాళికలో కేటగిరీల వారీగా రుణాలను మంజూరు చేయబోతున్నట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు. స్వయం ఉపాధి కింద 19790 మంది లబ్ధిదారులకు వారు ఏర్పాటు చేసుకునే యూనిట్ల వారిగా మూడు విభాగాలుగా గుర్తించి రుణాలు అందించడం జరుగు తుందని తెలిపారు. ఇందులో 15000 మంది లబ్ధిదా రులకు రూ.లక్షలోపు రుణం, 3040 మంది లబ్ధిదా రులకు రూ.లక్ష నుండి రూ.3లక్షల వరకు,1525 మంది లబ్ధిదారులకు రూ.3లక్షల నుండి రూ.5లక్షల వరకు, 225మంది లబ్ధిదారులకు రూ.8లక్షలు ప్రకా రం రుణం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి స్కీమ్‌లో కనీసం 40శాతం మహిళలకు చోటు కల్పిస్తారని అన్నా రు. రూ.లక్ష లోపు రుణాలు మంజూరులో కిరాణా, పాన్, చికెన్, మటన్, పండ్లు, కూరగాయలు స్టాల్స్ ఏర్పాటు, ఎలక్ట్రికల్ రిపేరీ, సైకిల్ షాప్‌లో తదితర యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇస్తారని, రూ.లక్ష నుండి రూ.3లక్షల లోపు ఏసి, ఫ్రిడ్జ్ రిపేరీ, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్, బ్యాటరీ సర్వీసింగ్, సెల్ ఫోన్ రిపేరీ, మటన్, చికెన్ షాప్‌లు, చెప్పుల షాపులు, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తా రని, రూ.3లక్షల నుండి రూ.5లక్షల వరకు ఆటో మొబైల్ సెక్టార్, ట్రాన్స్ పోర్టు సెక్టార్, ఫ్యాబ్రికేషన్ సెక్టార్ తదితర యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తా రు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునే వారికి మండల కేంద్రాలు, పురపాలక, నగరపాలక కేంద్రాల లో ఉన్నవారికి జనరిక్ మందుల దుకాణాలు, ఆటో మొబైల్ యూనిట్లు, ఫిట్ నెస్ సెంటర్లు తదితర యూని ట్లు ఏర్పాటు చేసుకున్నందుకు రూ.8 లక్షలు రాయితీ రుణం మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నా రు. మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా 25వేల మందికి, మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి కింద టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వాటిల్లో 3,428 మందికి, మైనార్టీ ఎంపవర్మెంట్ కింద ఆటో మొబైల్ సెక్టార్, ఈవెంట్ మేనేజ్మెంట్, ఫిజియోథెరపీ తదితర వాటిల్లో వెయ్యి మంది మైనార్టీలకు, మొత్తం 29,428 మందికి శిక్షణ ఇవ్వబోతున్నట్లు అజీజ్ తెలి పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేం దుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి అప్పటి పాలకులు తూట్లు పొడిచారని విమర్శించారు. అధికా రంలోకి వచ్చిన 6నెలల కాలంలోనే అన్ని రంగాలలో పూర్తిగా భ్రష్టు పట్టి పోయిన రాష్ట్రాన్ని గాడిన పెట్టేం దుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు చేస్తున్న కృషితో అప్పటి సమస్యల పరిష్కారం వేగవంతంగా కొలిక్కి వస్తు న్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం బడ్జెట్లో కేటాయింపులకు అనుగుణంగా వార్షిక ప్రణాళిక ప్రకారం నిధుల మంజూరు, తదుపరి అభి వృద్ధి చర్యలు, ఆర్థిక చేయూతకు రాయితీ రుణాలు, మైనార్టీల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు.

# ప్రమాదరహిత సమాజం అందరి లక్ష్యం కావాలి





## రోడ్డుభద్రత ప్రధానకర్తవ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రమాదరహిత సమాజం అందరి లక్ష్యం కావాలని, రోడ్డు భద్రత కర్తవ్యంగా భావించాలని. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు సాగించాలని ఆత్మకూరు మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు, సీఐ గంగాధర్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తదితరులు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరులో రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా పెద్దఎత్తున ర్యాలీ, మానవహారం నిర్వహించి తమ ప్రసంగాల ద్వారా అందరికీ అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ర్యాలీని స్థానిక ఆర్డీవో బి.పావని జెండా ఊపి ప్రారంభించారు. ఎంవిఐ, సిఐ, ఎస్ఐలు, సిబ్బంది, తెలుగుదేశం నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వందలాదిమంది విద్యార్థినీ, విద్యార్థులు ప్లకార్డులు చేత బూని నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్ వద్దనుండి ఎల్ఆర్‌పల్లి, సోమశిల రోడ్డు సెంటర్, బిఎస్ఆర్‌సెంటర్, జెఆర్‌పేటలమీదుగా మున్సిపాల్ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఎంవిఐ ఎం.రాములు, సీఐ గంగాధర్‌లు ప్రసంగించారు. వాహనాలను నడిపేవారు తప్పకుండా రోడ్డునిబంధనలు పాటించాలని, జాగ్రత్తతో వాహనాలు నడిపి ప్రమాదాలు లేకుండా చూసుకోవాలని, కొండంత చికిత్సకన్నా గోరంత జాగ్రత్తమేలు అనే నానుడి గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. వాహనాలను మద్యం సేవించి నడపరాదని, సీట్‌బెల్టులు తప్పకుండా పెట్టుకోవాలని, ద్విచక్రవాహనకారులు హెల్మెట్లు తప్పకుండా ధరించాలని వారు సూచించారు. మితిమీరిన వేగం తగదని, వాహనాలను ఓవర్‌టేక్‌చేయరాదని, ప్రయాణీకులను అధికంగా ఎక్కించుకోరాదని వారు కోరారు. ఏదేని ప్రమాదాలు జరిగినపుడు వాహనాలవారు వెంటనే క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించాలని, లేదా 108వాహనానికి ఫోన్‌చేసి సమాచారమివ్వాలని, వాహనలను లైసెన్సు ఉన్నవారు మాత్రమే నడపాలని వారు సూచించారు. ప్రమాదాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని, నియమావళి పాటించాలని, మాససిక ప్రశాంతతో వాహనాలు నడపాలని కూడా చంద్రారెడ్డి, రాములు, గంగాధర్‌లు సూచించారు. ఈ కార్యక్రమంలో స్తానిక ఎస్ఐలు షేక్ జిలాని, ఎస్.సాయిప్రసాద్, కె.శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, పయ్యావుల మారుతీనాయుడు, స్రెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాగాల శ్రీహరి, పోలీస్ సిబ్బంది, వందలాదిమంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**దగదర్తి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలం తడకలూరు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల తగిలి ఇద్దరు గిరిజనులు మృతి చెందడం పై ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తడకలూరు గిరిజన కాలనీలో మృతి చెందిన మాణిక్యాల శ్రీనివాసులు పొట్లూరి బాలయ్య కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. తక్షణ సాయం క్రింద రెండు కుటుంబాలకు కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. తెలుగు దేశం పార్టీ తరపున బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కృష్ణా రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, నెల్లూరు పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరి నాయుడు, మండల అధ్యక్షులు అల్లం హనుమంతురావు, ప్రధానకార్యదర్శి ఇబ్రిన్ చేజర్ల పులి శీనయ్య, పాపన మల్లికార్జునరెడ్డి, బోలిగర్ల వెంకట రత్నం, బత్తల హాజరత్తయ్య, బాలు బోయినభాస్కర్, బాలు, బోయిన వెంకటేశ్వర్లు, పెళ్లూరు శ్రీనివాసులు, ఆత్మకూరు బాబులు నాయుడు, అన్నం మల్లికార్జున, పొట్లూరు కిషోర్, మరు బోయిన గోపాల్, గోపసాని శ్రీనివాసులు, పేట హాజరత్తయ్య, ఎండీ అప్సర్, పైడి శేషయ్య, పొంకం ప్రతాప్, కంద్రా వెంకటేశ్వర్లు, ముత్యాల గిరి, తాళ్లూరు కిషోర్, చల్లా శ్రీహరి, రాధాకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

# జనవాణి కార్యక్రమం..

**ప్రజలనుండి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి, పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచన**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జనసేన అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ప్రారంభించిన జనవాణి కార్యక్రమంలో భాగంగా, జనసేన ఆఫీస్ గోమతి నగర్‌లో జనవాణి కార్యక్రమం నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు, ఏపీ టిడ్కో చైర్మన్, వేములపాటి అజయ్ కుమార్ సూచనల ప్రకారం, ప్రతి బుధవారం, శనివారం నిర్వహించు చున్న జనవాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలనుండి అర్జీలు, స్వీకరించి, వాటిని పరిశీలించి, పరిష్కరించే విధంగా కృషి చేయటమైనది. కార్యక్రమంలో జనసేన నాయకులు, నూనె మల్లికార్జున్ యాదవ్, చిత్తలూరు సుందర రామిరెడ్డి (రాష్ట్ర సంయుక్త కార్యదర్శి) గునుకుల కిషోర్ (జిల్లా ప్రధాన కార్యదర్శి) కృష్ణారెడ్డి (జనసేన అధికార ప్రతినిధి, నెల్లూరు) ఏటూరి రవి కుమార్ (చిరంజీవి యువత నాయకులు) కరీం (30 డివిజన్ ఇంచార్జి) పవన్ యాదవ్ (1 డివిజన్ ఇంచార్జి) బిల్లా ఉదయ్ కిరణ్ (27 డివిజన్) జనసేన జిల్లా ఆఫీస్ ఇంచార్జి, జమీర్ పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా...



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలానికి చిమటా శేషగిరి రావు, విడవలూరు మండలానికి కాటంరెడ్డి నవీన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన మండలాల అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా మాజీ మంత్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, కోవూరు నియోజకవర్గ యువజన విభాగం కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డికి పూల మొక్కని బహుకరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, సీనియర్ నాయకులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## స్వాగతం పలికిన పాతవెల్లంటి గ్రామ ప్రజలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని పాతవెల్లంటి గ్రామంలో 15వ రోజు గడపగడపకు క్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాతవెల్లంటి గ్రామస్తులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంటిలో హారతి ఇచ్చి, నుదుటున మహిళలు తిలకం దిద్దారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార దిశగా ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. నిత్యం ప్రజల కోసం ప్రజల్లోనే ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాత వెల్లంటి గ్రామ టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ పంట తప్పనిసరిగా చేసుకోవాలి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని రైతులు ఈ పంట కింద వారి పేర్లను, పంట వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య కోరారు. మండలంలోని దండిగుంట, రామచంద్రపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట, ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఇందుకోసంగా వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు అవగాహన కల్పించి ఈ పంట, ఈకేవైసీలను త్వరగా నమోదు చేసుకునే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఇలా నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి రైతులకు రావాల్సిన రాయితీలతో పాటు పథకాలు అందుతాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సజావుగా మండల సాధారణ సర్వసభ సమావేశం





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ సమావేశం ఎంపీపీ విజయ్ కుమార్ అధ్యక్షతన ఎంపీడీవో వి.శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సర్వసభ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖపై సమీక్ష, గృహ నిర్మాణ శాఖ ప్రగతి పై సమీక్ష, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పై సమీక్ష, మహిళ శిశు సంక్షేమ పథకాలు అమలుపై సమీక్ష, వైద్య, ఆరోగ్య శాఖ పై సమీక్ష, వెలుగు శాఖపై సమీక్ష, విద్యాశాఖపై సమీక్ష, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలపై సమీక్ష, ఉద్యానవన శాఖపై సమీక్ష, జల జీవన్ మిషన్ పథకం పురోగతిపై, త్రాగునీరు, పారిశుధ్యం పై సమీక్ష, పలు శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొరసానమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు అల్లాబక్షు, నెల్లూరు రూరల్ విద్యుత్‌శాఖ ఏఈఈ కుమార్, మండల వ్యవసాయధికారి నాగమోహన్, నెల్లూరు రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి, వెలుగు ఏపీఎం రోజ్ మేరీ, సౌత్ మోపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి, ఉపాధిహామీ ఏపీఎం, హౌసింగ్ ఏఈ, నెల్లూరు రూరల్ మండల విస్తరణాధికారి, పలు మండల స్థాయి అధికారులు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పలు గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విజయదీపికలను విద్యార్థులకు అందజేసిన ఎంపీపీ కేతా



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థినిలకు బుధవారం విజయదీపిక పుస్తకాలను స్థానిక మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. 10వతరగతి విద్యార్థులు పరిక్షల్లో మంచి మార్కులు సాధించేలా ప్రభుత్వం విజయదీపిక పేరుతో ప్రత్యేకంగా పుస్తకాలను రూపొందించి సమకూర్చగా మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన విజయదీపికలను కూడా బాగా చదువుకొని పరిక్షల్లో అత్యధికమార్కులు సాధించాలని కోరారు. అందరూ మంచిమార్కులతో ఉత్తీర్ణులుకావాలన్న లక్ష్యంగా ప్రభుత్వం ఈపుస్తకాలను రూపొందించిందన్నారు. సులభరీతిలో అభ్యశించి పరిక్షలకు సిద్ధమయ్యేలా విజయదీపికలు ఉపయోగపడతాయని, అందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకుడు గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కోటేశ్వరమ్మ, పాఠశాల విద్యాకమిటి చైర్‌పర్సన్ తహశిన్‌సుల్తానా, నాగమణి, ఉపాధ్యాయిని డమ్ము పద్మ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ధ్యానం బహుళప్రయోజనకరం : భీమినేని


ధ్యానం గురించి అవగాహన కల్పిస్తున్న మాస్టర్ భీమినేని వంశీకిరణ్


కార్యక్రమంలో పాల్గొన్న జనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ధ్యానం బహుళ ప్రయోజకరమని విశాఖపట్టణంకు చెందిన ప్రముఖ ధ్యానగురువు భీమినేని వంశీకిరణ్ పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరులోని శ్రీ షిరిడి సాయి పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో ఆయన ఆత్మజ్ఞానప్రసంగం గావించారు. అనేక అధ్యాత్మిక అంశాలను వివరించారు. ధ్యానం చేయడం వలన కలిగెడి ప్రయోజనాలను వివరించారు. సమాజంలో జనం అనుభవిస్తున్న అనుభవానికి మనమే కారణమన్నారు. ఆరోగ్యం కావాలన్నా, ఐశ్వర్యం కావాలన్నా ధ్యానం చేయాలని ఆయన సూచించారు. అద్భుతమైన అమృతాహారం శాఖాహారమని, అందరూ శాఖాహారాన్నే భుజించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరిని గౌరవించాలన్నారు. కర్మధ్యానం గురించి ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి మానవజన్మ పరమార్థాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ధ్యానమాస్టర్లు, పలువురు ధ్యానులు, ప్రజలు పాల్గొన్నారు.

## చెర్లోయడవల్లిలో పశువైద్యశిబిరం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో బుధవారం పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు డాక్టర్ జయచంద్రుడు ఆధ్వర్యంలో పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి ప్రారంబించగా మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి, జిల్లా సర్పంచ్‌లసంఘ మాజీ అధ్యక్షుడు కేతా విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు చెందిన పశువులు ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రామీణప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. డాక్టర్ జయచంద్రుడు గొర్రెలు, మేకలు, లేగదూడలు, పశువులకు నట్టలనివారణ మందులు గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు, పశుగ్రాసపెంపకం, టీకాల కార్యక్రమం గురించి ఆయన వివరించారు. శిబిరంలో ఆయన పశువులకు వైద్యపరిక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ చేరెడ్డి ప్రభావతి, వివల్‌వో నారాయణరెడ్డి, సీహెచ్ రాము, పలువురు రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గొట్టిపాటిని కలిసిన హరిచౌహన్ నాయక్

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్య పైన త్వరగా పరిష్కరించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే ఎస్సీ ఎస్టీ కమిషన్ జాయింట్ కమిటీని నియమించి ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడే హరి చౌహన్ నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తులు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌కు స్వాగతం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవ స్థానం దర్శనార్థ స్టేట్ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు విచ్చేశారు. వారికి తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ ప్రెసి డెంట్ ఎం.సుబ్బయ్య ఘన స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు వెర్రి రమేష్, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి వజ్రం కిషోర్, ఎస్టీ విద్యార్థుల సంఘం నాయకుడు సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

## ఎస్ఐ రాజేంద్రన్ మృతికి ఎమ్మెల్యే నివాళులు

**సత్యవేడు, మేజర్‌న్యూస్ :** ఊత్తుకోట ఎస్ఐ రాజేంద్రన్‌కు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం ఘనంగా నివాళులు అర్పించారు. పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏపీ పోలీసులు 15 రౌండ్లు కాల్పులు జరిపి ఊత్తుకోట ఎస్ఐ రాజేంద్రన్‌కు పోలీసు మర్యాదలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో భారీగా తమిళనాడు పోలీసులు పాల్గొన్నారు.

## గుడివారిపల్లిలో పశువైద్య శిబిరం

**పాకాల, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గాదంకి పంచాయతీ గుడివారిపల్లిలో పశు సంవర్ధక శాఖ ప్రభుత్వం ఉచిత పశు ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాకాల జడ్పీటిసి నంగా పద్మజ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఇరుగు గురుమూర్తి విచ్చేశారు. గ్రామంలో ఉన్నటువంటి 105 పశువులకు పిడు దుల మందు పిచికారి చేసి, 35 మేకలకు, దూడలకు, పశువులకు నట్టల నివారణ మందు తాగించడం జరిగింది. గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. పాకాల జడ్పీటిసి నంగా పద్మజ రెడ్డి, గాదంకి మాజీ ఎంపీటీసీ ఇరుగు గురుమూర్తి చేతుల మీదుగా పశువులకు సంబంధించిన ప్రభుత్వం తరపున ఉచిత మందులు పంపిణీ చేశారు. పశువులకు స్ప్రే మందు చేశారు. ఉచిత పశు వైద్య శిబిరాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రవి, పాకాల మండలం పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వి.శ్రీధర్, కె.ఓడ్డేపల్లి పశు వైద్యాధికారిని జి.మోహన కుమారి, పశుసంవర్ధక సహాయకులు కేజీ అనిల్ కుమార్, ఎస్.సరిత, పి.ఆనంద్, సి.ముని శంకర్, సుధాకర్ తదిరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం



**తడ మేజర్‌న్యూస్:** తడ కంఢ్రిగ మండల ప్రజా పరిషత్ పాఠశాల నందు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ఎంఈఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మోహన్ రెడ్డి విచ్చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా పాఠశాల నందు చెట్లను నాటి వాటికి పెంచింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో పచ్చదనంగా ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సాయి భరత్, ఫీల్డ్ ఆఫీసర్ విజయ్ తేజ, హెడ్మాస్టర్ సురేంద్ర, కాంప్లెక్స్ హెచ్‌ఎం సురేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**తడ, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని అన్ని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ నందు పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు గురువారం ఎంపీపీ కెళవి రఘు రెడ్డి ఆధ్వర్యంలో విజయ దీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలో ఉన్న పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో ఉన్న నిరక్షరాశులకు ఉల్లాస్ అక్షర వెలుగు అను పుస్తకాలను మండలాల్లోని అన్ని గ్రామాల నందు వయోజన విద్య ద్వారా చదువుకొనే వారికి ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు చదువుకొనే వారిని ఎంపిక చేసి వారికి చదువు చెప్పబడునట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జునరావు అన్ని పాఠశాలల హెడ్మాస్టర్లు, ఏపిఎం, సిసిలు, విఓఏ లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చల్లా బాబుని కలిసిన మాజీ సైనిక సంఘం

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పుంగునూరు నియోజకవర్గ మాజీ సైనిక సంఘం గౌరవ అధ్యక్షులు సుకుమార్ బాబు ఆధ్వర్యంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డిని సోమవారం కలిశారు ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతూ భీమ గాని పల్లి పంచాయతీలోని రాంపల్లి వద్ద మాజీ సైనికుల కమ్యూనిటీ హాల్ నందు ఈనెల 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగాఫ్లాగ్ హస్టింగ్‌కు చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించడం జరిగినది దానికిచల్లా బాబు సహృదయంతో అంగీకరించడం జరిగిందన్నారు ఈ రిపబ్లిక్ డేమహోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ సైనిక సంఘం అధ్యక్షులు రెడ్డప్ప వైస్ ప్రెసిడెంట్ జవహర్ సెక్రెటరీ ప్రతాప్ ఈసీ నెంబర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## విభూది అలంకరణలో శ్రీ కాళభైరవ స్వామి



**నగరి, మేజర్‌న్యూస్:** పట్టణంలో వెలసిన శ్రీ కరకంటేశ్వర స్వామి ఆలయంలో కొలువైవున్న కాళ భైరవ స్వామి వారికి ప్రత్యేక అష్టమి పర్వదినాన విశేష అభిషేక అర్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి పాలు, పెరుగు, పంచామృతం, పన్నీరు, చందనము, తేనె మొదలగునవి సుగంధ ద్రవ్యములతో ఆలయ అర్చకులు విశేష అభిషేకాలు చేశారు. అభిషేక అనంతరము స్వామివారికి విభూది అలంకరణ ప్రత్యేకంగా దర్శనమిచ్చాయి. ఉభయ దారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ నిర్వహకులు విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదములు అందించారు.

## మన్నెమ్మ మృతదేహానికి నివాళులు



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని కృష్ణాపురం పంచాయతీ పరిధిలో ఉన్న పొన్నగల్లు గ్రామానికి చెందిన మునెమ్మ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహానికి కృష్ణాపురం అధ్యక్షులు అన్నామలై మృతదేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేశారు. రామచంద్ర రాజు, సురేష్, సూర్యనారాయణ రెడ్డి, రమేష్ ,గణేష్ రాజు, సుబ్రమణ్యం, శ్రీనివాస్ యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

### బొమ్మేపల్లి సచివాలయం తనిఖీ చేసిన డిపిఓ

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు బుధవారం వెదురుకుప్పం మండలం బొమ్మేపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం దేవళంపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. బొమ్మేపల్లి పంచాయతీలో జరుగుతున్న శానిటేషన్‌పై డిపిఓ తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. డిపిఓ వెంట ఈఓపిఆర్‌డి పురుషోత్తం, సచివాల సిబ్బంది ఉన్నారు.



# లాడ్జిలో అనుమానాస్పద వ్యక్తి మృతి

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ లాడ్జి రూమ్ నెంబర్ 101లోఘటన. మృతుడు తమిళనాడు



రాష్ట్రం, విరుద్ నగర్ జిల్లా,కు చెందిన రాధాకృష్ణన్ కుమారుడు జయకన్నన్‌గా పోలీసులు గుర్తించారు. ఈనెల 21వ తేది 11 గంటలకు లాడ్జికి రావడం జరిగింది 22 వ తేది ఉదయం లాడ్జి రూమ్ బాయ్ తలుపులు తట్టిన తీయకపోవడంతో పోలీసులకు సమాచారం అందించగా లాడ్జి సిబ్బందిచే పోలీసుల ఆధ్వర్యంలో తలుపులు బద్దలు కొట్టి చూడగా బెడ్ పై పడుకున్న వ్యక్తి పడుకున్నట్లే మృతి చెందిన నట్లు తెలుస్తుంది. మద్యం సేవించినట్టు రూమ్ లో ఆనవాళ్లు. మృతదేహాన్ని రూయా ఆసుపత్రికి తరలించెందుకు పోలీసులు చర్యలు తీసుకొన్నారు మృతుడి వద్ద లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఈస్ట్ ఎస్ఐ మహేష్ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 11 మందికి జరిమానా

**- ఉమ్మడి జిల్లాల ఎస్పీ మణికంఠ ఛందోలు**

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 11 మంది నిందితులను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా జడ్జి శ్రీ గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున మొత్తం 11 మందికి రూ.లక్ష పదివేలు జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ ల పనితీరును ఉమ్మడి జిల్లా ఎస్పీ మణికంఠ ఛండోలు అభినందించినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ఏపీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఉద్యమాలు నిర్వహిస్తుందని రాష్ట్ర నాయకులు కవరికుంట్ల జయరాజ్ జిల్లా ఎన్నికల అధికారి చల్లా జయచంద్ర, జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం కార్వేటినగరంలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరులో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి నిధులు కేటాయించాలని అక్రిడేషన్ కార్డు మంజూరులో సరళ తరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులో పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. తమిళనాడు ప్రభుత్వం అమలు చేసిన విధంగా జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యాన్ని 15000 రూపాయలు ఇవ్వాలని కోరారు జర్నలిస్టులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు జర్నలిస్టుల సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు అనంతరం జిల్లా ఎన్నికల అధికారి చల్లా జయచంద్ర నియోజకవర్గ కమిటీకి ఎన్నికలు నిర్వహించారు సభ్యులు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీని రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా అభినందించింది. ఏపీడబ్ల్యూజేఎఫ్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులు బి మోహన్ దాస్ మహా న్యూస్ టీవీ , వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం మునికృష్ణ సుమన్ టీవీ, ఉపాధ్యక్షుడులుగా మోహన్ రెడ్డి ప్రజాశక్తి, శరవణ కుమార్ వార్త, ప్రధాన కార్యదర్శిగా దేవరాజులు, ఆంధ్రప్రభ, ఆర్గనైజం కార్యదర్శిగా ఏం సుబ్రహ్మణ్యం సాక్షి టీవీ, సహయ కార్యదర్శులు మహేంద్ర సూర్య, కే సుధాకర్ ప్రజాశక్తి, కోశాధికారి రూప్ చంద్రారెడ్డి ఆంధ్రప్రభ, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## టీడీపీ నేత సుధాకర్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

**కేవిబి పురం, మేజర్‌న్యూస్:** బుచ్చినాయుడు కంఢ్రిగ మండలం కుమార వెంకటాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుధాకర్ మరణించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మృతుని స్వగ్రామానికి చేరుకొని మృతునికి నివాళి అర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, సుధాకర్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## అంగన్వాడీ పిల్లలకు ఆధార్ కార్డులు తప్పనిసరి



**పెద్దపంజాణి, మేజర్ న్యూస్:** అంగన్వాడీ పిల్లలకు ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు తప్పనిసరి అని పెద్ద పనిని ఎంపీడీవో బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని చలమంగళం అంగన్వాడి పాఠశాలను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలను సూచిగా పరిశుభ్రంగా అందజేయాలని సూచించారు. అంగన్వాడీ పిల్లలకు ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్స్ తప్పనిసరిగా నమోదు చేయించాలని తెలియజేశారు. అంగన్వాడి వర్కర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో అంగన్వాడీ పిల్లలకు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల జారీలో ఎలాంటి ఆలస్యం కాకుండా చూడాలని, స్పెషల్ ఆధార్ క్యాంప్స్ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

# ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

**సూళ్లూరుపేట రూరల్, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా మన్నే ముత్తేరి పంచాయితీ లో సూళ్లూరుపేట పట్టణ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ధనలక్ష్మి, అసిస్టెంట్ మేన్ జర్ ' సాయికుమార్ ఆధ్వర్యంలో బుదవారం మన్నే ముత్తేరి పంచాయితీ లో ఉన్న డంపింగ్ యార్డ్ లో స్వచ్ఛ భారత్ లో బాగంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మంగా చేపడుతున్న కార్యక్రమానికి పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లో పచ్చ ధనం పరిశుభ్రత పాటించాన్నారు. మేము ప్రస్తుతం డంపింగ్ యార్డ్ లో నాటిన మొక్కలు పది పందికి ఉపయోగ పడే విధంగా గ్రామస్తులు వాటిని సంరక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసిడెంట్ ఎద్దల చిన్ని రాజ గ్రామస్తులు తది తరులు పాల్గొన్నారు.



# పచ్చదనంపై గొడ్డలివేటు..!



## పర్యావరణాన్ని మరిచిన అధికారులు

**చెట్లను పెంచమన్నారు.. పర్యవరణాన్ని కాపాడమన్నారు. పచ్చదనం పరిశుభ్రత అన్నారు. ఈ మాటలు నీటిమూటలుగా మిగిలాయి.. అధికార యంత్రాంగం బాధ్యత మరిచింది. పచ్చ దనంపై గొడ్డలి వేటు పడింది. అడిగేవారు లేరు.. చర్యలు లేవు.. అందుకే చట్టం ప్రైవేటు వ్యక్తులకు చుట్టమైంది. పచ్చని చెట్లు నేలకొరిగాయి. వివరాలు ఇలా ఉన్నాయి..**

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలను ప్రైవేటు వ్యక్తులు సగం వరకు నరికివేశారు. ఇన్ని రోజులు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిన పచ్చని చెట్లు లేక ప్రస్తుత ఈ రోడ్డు బోసిపోయి కనిపిస్తోంది. విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం వల్ల అవి పెరిగి పెద్దయ్యాక నరికివేతకు గురవడం పరిపాటిగా మారింది. చెట్లను నరికే పనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో యంత్రాలతో ఇష్టానుసారంగా నరికివేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి చెట్లు నాటే సమయంలో బలంగా ఉండే చెట్లను నాటడంతోపాటు తీగల కింద తక్కువ ఎత్తు పెరిగే మొక్కలను నాటే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**ఆర్ అండ్ బి ఏఈ వివరణ :** రోడ్డుకు ఇరు వైపులా చెట్లను నరకడం రెండు రోజుల నుండి జరుగుతున్నప్పటికీ ఆర్ అండ్ బి ఏఈ చంద్ర శేఖర్ వివరణ అడగగా నాకు చెట్లను నరుగుతున్నటువంటి విషయం ఏమాత్రం తెలియదని, నేను ఒక మండలం కాదు నాలుగు మండలాల వర్క్ చేస్తున్నాను అని తెలిపారు. రాపూరు పొదలకూరు కూడలి నుండి పొదలకూరు వరకు గల ప్రధాన రోడ్డులో ఒక వైపు తీగలకు తగులుతున్నాయనే కారణంతో చెట్లను సగం వరకు నరికేయడం విచారకరం.

**విద్యుత్ శాఖ ఏఈ వివరణ :** మాకు తెలిసి ఎలాంటి అను మతులు లేవు. చెట్లును నరికించే విషయంలో మాకు ఎటువంటి సంబంధం లేదని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

**ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి వివరణ :** సైదాపురం నుండి పొదలకూరుకి పోయేటువంటి రోడ్డు మార్గంలో రోడ్డుకి ఇరువైపులో ఉన్నటువంటి చెట్లను నరకడానికి మేము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెట్లు నరికే రెండు మిషన్లు పట్టుకున్నట్లు కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు.

# బుచ్చి పట్టణ శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

- బాలాజీ లేవుట్ వాసులకు హామీ
- మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి



**నెల్లూరు సిటీ / బుచ్చి, మేజర్‌న్యూస్ :** రానున్న బడ్జెట్‌లో బుచ్చిరెడ్డి పాలెం శివారు ప్రాంతాలలో మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యత యిస్తామన్నారు మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి. రోడ్లు, డ్రైనేజి సదుపాయాల కల్పించాలని బుచ్చి పట్టణ ఐదవ వార్డు పరిధిలోని బాలాజీ లేఔట్ వాసులు ఛైర్ పర్సన్ సుప్రజా మురళి, కమీషనర్ చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ సుప్రజా మురళి మాట్లాడుతూ.. బుచ్చి పట్టణ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని హామీఇచ్చారు. కమీషనర్‌తో కలిసి బాలాజీ లేఔట్ సందర్శించి అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అనంతరం బాలాజీ లేఔట్ వాసులైన అంకిరెడ్డి, వెంకటేశ్వర్లు, కోదండ రామయ్య, శ్రీహరి, తదితరులు సమస్యలపై యిచ్చిన వినతిపత్రాన్ని అందుకున్నారు.

## మహిళలు బాలబాలికల సంరక్షణే..

# పోలీసు శాఖ ధ్యేయం : డీఎస్పీ




**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** సమాజంలోని మహిళలు, బాలబాలికల సంరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. బుధవారం ఉదయం నెల్లూరు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నెల్లూరు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో జరిగిన అవగాహన సదస్సులో డిఎస్పీ పాల్గొని ప్రసంగించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, మహిళలు, బాలబాలికల సంరక్షణ చర్యలు, ఫోక్సో యాక్ట్, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ క్రైమ్ లపై కాలేజీ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ సీఐలు కృష్ణారెడ్డి, టీవీ సుబ్బారావు, ఎస్ఐ భాస్కర్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వసుంధర దేవి, ఏహెచ్‌టీయు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల ఫలితమే..

# గాజు గ్లాసు గుర్తుకేటాయింపు

▶ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఎన్నో పోరాటాల ఫలితంగా జనసేన పార్టీకి ఎన్నికల గుర్తుగా గాజు గ్లాస్ వచ్చిందని నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ బాబు అన్నారు. ఆ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గాజు గ్లాస్ గుర్తు కేటాయిస్తూ ఆ పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ కు లేఖ రాయగా బుధవారం సాయంత్రం ముత్తుకూరు బస్టాండ్ సెంటర్లో జనసేన పార్టీ నాయకులు సంబరాలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలకు గాజు గ్లాసుల్లో టీ పంపిణీ చేసి సంతోషాన్ని చూపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ చరిత్ర సృష్టించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు భవాని నాయుడు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి దినపత్రిక సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9963827227

## వేదగిరిపై స్నపన తిరుమంజనం, తిరుప్పావడ సేవ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు బుధవారం నాడు స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా మూలవిరాట్‌కు స్నపన తిరుమంజనం, తిరుప్పావడ సేవ కార్యక్రమాలు ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. తిరుప్పావడ సేవ ఉభయ కర్తలుగా మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించగా అర్చక సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుకు అడ్డంగా కంచే



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం ఉమామహేశ్వర పురం గ్రామం పంచాయతీలో గ్రామ నట్టం క్రింద ఉన్న పీపీఎన్ నంబర్ 45లో కొంత భాగాన్ని స్థానికులు కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారాని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు కంచవేసి రోడ్డు మార్గాన్ని ఆక్రమించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. ఆక్రమనలపై స్థానికులు అధికారులకు తెలపగా రోజులు గడుస్తున్న నేటికీ ఆక్రమణ తొలగించకుండా జాప్యం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.